# అక్షింతలివిగో...



ఆ గదిగోడలు తెల్లగా ఉన్నాయి.
మెల్లిగా, మెత్తగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాను తెల్లగా ఉంది.
డబుల్‌కాట్ మీదున్న దుప్పటి తెల్లగా ఉంది.
పక్కనే స్టూలుమీద తెల్లసాసరులో నిలబడి ఉన్న పాలగ్లాసు, అందులో పాలు తెల్లగా ఉన్నాయి.

పక్కమీద మల్లెపూలు తెల్లగా ఉన్నాయి.

కిటికీలోంచి పడుతున్న వెన్నెల, గోడమీద ట్యూబులైటు వెలుతురూ తెల్లగా ఉన్నాయి.

ఆ గదంతా తెలతెల్లగా, నులి వెచ్చగా ఉంది.

డబుల్‌కాట్ మీద కూర్చున్న అతను, గుమ్మం దగ్గర నిలబడ్డ ఆమె తెల్లని బట్టల్లో ఉన్నారు.

అతను నవ్వాడు. ఆ నవ్వు తెల్లగా ఉంది.

ఆమె నవ్వింది. ఆ నవ్వూ తెల్లగానే ఉంది.

వాళ్ళిద్దరికీ అంతకు ముందు రెండు క్షణాల క్రితమే వెన్నెలతో అభిషేకం చేయించినట్టు తెలతెల్లగా మెరిసిపోతున్నారు.

అతను మంచంమీంచి లేస్తూ మళ్ళీ నవ్వాడు. గర్వంగా, మృదువుగా.

ఆమె గుమ్మం దగ్గర్నించి కదలకుండా నవ్వింది, సిగ్గుగా, మృదువుగా, మత్తుగా.

"ఎందుకు నవ్వుతున్నావు?" అడిగాడతను.

ఆమె జవాబు చెప్పకుండానవ్వింది, పెదాలు విడివడకుండా. అతనామె దగ్గర కొచ్చాడు. ఆమె అతనివైపు వెళ్ళబోయి మానేసింది.

"ఎందుకా నవ్వు?" అడిగాడతను మళ్ళీ, ఆమె భుజాల మీద చేతులేస్తూ.

"ఏంలేదు"

"ఏంలేకపోతే నవ్వడమెందుకు?"

"మీరెందుకు నవ్వుతున్నారు?"

"పెళ్ళిచూపుల్లో మొదటిసారి నిన్ను చూసీ చూడగానే ఇష్టపడ్డాను. ఈమెని పెళ్ళి చేసుకుంటే బాగుండని అనుకున్నాను. నేననుకున్నట్టే పెళ్ళయింది. ఈ సంగతి చెబితే పెళ్ళిచూపుల్లోనే ప్రేమించారా అని నవ్వుతావేమోనని నాకు నవ్వొచ్చింది"

"నేను అంతే. మన పెళ్ళి చూపులైన మర్నాడు. రిటైర్డ్ ఇంజనీరు గారింటికి వెళ్ళానుకాని మీ ప్రస్తావన ఎలా తీసుకురావాలో అర్థం కాలేదు. రెండు మూడు సార్లు ఆంధ్రా ఎలెక్ట్రానిక్స్ అన్నాను. సందర్భం పాడూ లేకుండా దాంతో ఇంజనీరుగారు గ్రహించారు. మీకు నేను నచ్చానని చెప్పారు. ఆ సంగతి ఇప్పుడు మీతో చెబితే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తుంటే నవ్వొచ్చింది"

అతను ఇంకోసారి నవ్వాడు.

ఆమె మరోసారి నవ్వింది.

* * *

"మొహం కడుక్కుని చీరె మార్చుకో. వాళ్ళొచ్చే టైమైంది" అందావిడ, కూతురు గుమ్మంలో కనిపించగానే.

ఆమె భారంగా బాత్‌రూమ్‌వైపు వెళ్ళింది. భుజాన టవల్, చేతిలో సబ్బు పెట్టెతో. ఎవరు వాళ్ళు, ఎందుకొస్తున్నారని మాత్రం అడగలేదు.

తమ్ముడు హడావుడిగా కాలేజీకి రాగానే గ్రహించింది. మళ్ళీ పెళ్ళి చూపులని. ఈ పెళ్ళి చూపుల కార్యక్రమం ఇంటర్ ఫస్టియర్‌లో ప్రారంభమై తను బియస్సీ ఫైనలియర్‌కి వచ్చినా నిర్విఘ్నంగా సాగిపోతూనే ఉంది.

యస్సెల్సీ తప్పినవాడి దగ్గర్నించి ఎం.బి.ఏ ప్యాసైనవాడి వరకు అందరూ వచ్చారు. చూశారు, వెళ్ళారు. ఒకడికి తను ఎత్తుగా కనిపించింది. ఇంకొకడికి లావుగా కనిపించింది. వేరొకతనికి కట్నం నచ్చలేదు. మరొకడికి తను నచ్చింది కాని అతని అక్కకి నచ్చలేదు. (ఆవిడ ఎగరలేని ఫ్లయింగ్ సాసర్‌లా ఉంటుంది) ఇంకొకడు అన్నీ నచ్చాయని చెప్పి మళ్ళీ కనిపించలేదు. బెటర్ ఛాన్స్ వచ్చి ఆగిపోయినట్టున్నాడు. ఇప్పుడొచ్చే ఘనుడు ఎలాంటివాడో, తనలో ఎన్ని లోపాలు చూడగలడో!

బాత్‌రూం నుంచి వచ్చి, తనకున్న మూడు కొత్త చీరెల్లో ఒకటి తీసుకుని (అంతకు ముందు పెళ్ళి చూపుల్లో కట్టుకుంది కాదు) లోపలి గదిలోకి వెళ్ళింది.

"ఈ రాళ్ళ నక్లెసు పెట్టుకొని, ఈ

ఉదయం వారపత్రిక



నాలుగ్గాజులూ వేసుకో'' అంది తల్లి నవ్వుతూ. పక్కింటినుంచి బంగారు వస్తువులు తేవొద్దని ఆమె లక్షసార్లు చెప్పింది, ఆవిడ లక్షసార్లూ తెచ్చింది.

ఆమె నెప్లను పెట్టుకుని గాజులు. వేసుకుంది. తనకున్నసన్నటి గొలుసు, రెండు గాజులు పెళ్ళి మాపులకొచ్చే వాళ్ళెణ్ణి ఆకర్షించలేవని ఆమెకి తెలుసు.

తండ్రివచ్చాడు, ఆ రోజే కూతుర్ని మొదటిసారి పెళ్ళి మాపులకి సిద్ధం చేస్తున్నట్టు హడావుడిగా ఉన్నాడాయన.

''ఏమ్మా, రెడీ అయ్యావా''

ఆమె తలూపింది. ఇక అబ్బాయి తనని మాడొచ్చున్నట్టు.

''చిన్నాణ్ణి బజారుకి పంపించాను, స్వీటూ హాటూ తెమ్మని'' అందావిడ. కష్టపడి ఇంట్లో తయారు చేసినా తినేవాడు కూతుర్ని చేసుకుంటాడనే నమ్మకం పోయిందావిడకి.

''ఈ మధ్య ఇళ్ళలోనే వేసిన స్వీట్లకంటే బజార్లోనే బాగుంటున్నాయి'' అన్నాడాయన భార్య ఉద్దేశం గ్రహించినట్టు.

ఆ బియస్సీ ఫైనలియర్ చదువుతున్న అమ్మాయి ఒకే సినిమాలో, ఒకే సన్నివేశం ఆరోసారి చూస్తున్నట్టు ఫీలైంది. మొదటి రెండో పెళ్ళి మాపులప్పుడు తల్లి ఇంట్లోనే ఎంతో జాగ్రత్తగా స్వీటూ, బజ్జీలు వేసేది. ఇంట్లోనే వేయమని తండ్రి కూడా చెప్పేవాడు. మూడో పెళ్ళి మాపుల కార్యక్రమం నుంచి పద్ధతి మారిపోయింది. అయినా ఇద్దరూ ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో బజారు స్వీటు తెప్పిస్తున్నట్టే మాట్లాడుతారు.

బైట ఆటో ఆగిన శబ్దం వినిపించింది. ఒకటి... రెండు.. మూడు నిమిషలు గడిచాయి.

ఆమె గుమ్మం చాటునుంచి చూసింది. లావాటి ముసలావిడ (కాబోయే అత్తగారు, ఎనిమిదో ఆవిడ) సగం కనిపించింది. మొహానికి మించిన మీసాలున్న కాబోయే మామగారు కనిపించారు. ఆయన కట్టుం నవ్వు కూడా కనిపించింది. రిటైర్డ్ ఇంజనీరు తెచ్చికోలు నవ్వు కనిపించింది, వినిపించింది. ఆయన వెనక ఉన్న పెళ్ళి కొడుకు కనిపించకుండానే లోపలికి వచ్చాడు.

పలకరింపులు, కుశల ప్రశ్నలు ప్రారంభమయ్యాయి.

''ప్రయాణం బాగా జరిగిందా?''

ఆర్టీసీ మీద విమర్శలు

''ఆటోవాడు ఎంత తీసుకున్నాడు?''

ఆటోవాళ్ళ మానసిక విశ్లేషణ

''సొంత ఇల్లేనా?''

''అవును... ఎప్పుడో మా తాతగారు కట్టించారు''

''పిల్లలెంతమంది!'' జవాబు తెలిసిన ప్రశ్నే.

''ఇదే పెద్దది. మిగతా వాళ్ళు చిన్నవాళ్ళు. మా పెద్దబ్బాయి ఇంటరు, రెండో వాడు తొమ్మిదో క్లాసు''

''వెరీగుడ్.. ఒక మైనస్‌ని బైటికి పంపిస్తే రెండు ప్లస్‌లు బైటినుంచి లొస్తాయి. నాకు బైటినుంచి తచ్చేది ఏదొక్కటే. మిగతా ముగ్గురూ ఆడపిల్లలు''

సామాజిక, ఆర్థిక దివాలాకోరుతనం.

''ఇప్పుడే బాగాచూసుకో మొహమాటం పడకుండా, తర్వాత సరిగ్గా చూడలేదని చెబితే బాగుండదు.''

అతను ఆమెవైపు చూశాడు. బాగానే ఉంది. ఇంతకుముందు తను చూసిన వాళ్ళకంటే అందగత్తె కాదు. వికారి కాదు. కొంచెం సన్నగా

పులిపాక శ్రీరామచంద్రమూర్తి

ఉంది. పెళ్లయ్యాక ఆడాళ్లకి వళ్లొస్తుందట. ఈమెకు వళ్లొస్తే బాగుండిచావదు. మొహం గుండ్రంగానూ లేదు, కోలగానూలేదు. ఏదో ఉంది. మొత్తానికి సాగిపోయే సెలయేరులా లేదు. ఆగిపోయిన కొలనులా ఉంది. ఏమిటో, వీధిలో కెళ్తుంటే మహా అందగత్తెలు కనిపిస్తారు. పెళ్లి చూపులకొస్తే ఒక్కతీ కనిపించదు.

ఆమె అతనివైపు చూసింది.

బాగానే ఉన్నాడు. తను చూసిన మిగతా ఆరుగురికంటే అందంగానూలేదు. వికృతంగానూ లేదు. ఇప్పుడిప్పుడే బొజ్జ పెరుగుతుంది. పెళ్ళయ్యాక మరీ వస్తుందేమో. మొహం పరవాలేదు. ముక్కు మహా పొట్టి. మరుకుదనం తక్కువ. ఏమిటో షాపింగ్‌కి వెళ్తుంటే అందమైన కుర్రాళ్లు చాలా మంది కనిపిస్తారు. పెళ్లి చూపుల్లో ఒక్కడూ కనిపించడు. పెళ్లంటూ లేకపోతే చాలామంది స్త్రీలకి పురుష సుఖం, చాలామంది పురుషులకి స్త్రీ సుఖం దొరకదన్న వలం అనుకుంటూను చెప్పాడు. అవును అలాంటి బీభత్సకరమైన నిజాలు ఆయనే చెప్పగలడు. ఏమిటి పిచ్చి ఆలోచన.

"నీ పేరేమిటమ్మా!" అడిగింది కాబోయే (ఎనిమిదో) అత్తగారు. ఎనిమిదో సారి చెప్పిందామె.

"ఏం చదువుతున్నావు?"

చెప్పింది.

"పాటలొచ్చా?"

"రావు"

"వంట చేయడం వచ్చా?"

"వచ్చు"

"ఒకసారి అటూ ఇటూ నడువమ్మా"

నడిచిందామె. ఎనిమిది కళ్లచూపులు తన - కాళ్ల మీద.

"మా వాడు ఎమ్మెస్సీ పాసయ్యాడు. ప్రస్తుతం ఆంధ్రా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగం" చెప్పాడు ముసలాయన.

"మా బావగారి మేనల్లుడి బావమరిది కూడా ఆ కంపెనీలోనే చేస్తున్నాడు. పేరు ఆనందరావు."

"ఓహో"

ఆమె కుర్చీలో కూర్చుని ఎవరివైపు చూడకుండా తన పాదాలువైపు చూసుకుంటోంది. అతనామె మొహంవైపే చూస్తున్నాడు. రెండు క్షణాలకోసారి.

"ఇక నువ్వు వెళ్లొచ్చమ్మా" అన్నాడు ఇంజనీరు. ఆమె వెళ్లింది. తర్వాత కొద్ది సేపు మామూలు మాటలు. చివరికి కుర్చీలు జరిపిన చప్పుడు. వినిపించాయి.

"ఏ సంగతీ ఇంజనీరుగారితో చెబుతాం" అన్నాడు ముసలాయన లేస్తూ.

ఆమె తండ్రి వెర్రి నవ్వు నవ్వాడు. వార్తల కోసం తెలుగు సమాచారం కొనుక్కున్నవాడిలా.

రెండు నిమిషాల తర్వాత ఆటో వెళ్లిన శబ్దం వినిపించింది. తండ్రీ, తల్లి లోపలికి వచ్చారు. ఆమె వాళ్ల దగ్గరికి వెళ్లకుండా పక్కింటివాళ్ల నెక్లెసు, గాజులుతీసి బల్లమీద పెట్టి చీర మార్చుకుంటోంది.

"ఏం చెప్పారు వాళ్లు?"

"నువ్వు నా పక్కనే ఉన్నావుగా, మళ్లీ ఇదేం ప్రశ్న"

"ఆ ముసలాయనతో రోడ్డు కవతల ఏదో మాట్లాడారుగా"

"నాతో మాట్లాడలేదు. ఇంజనీరుగారితో ఏదోమాట్లాడాడు. నేను బాగుండదని ఇవతలికి వచ్చాను"

అరగంట తర్వాత ఇంజనీరు లోపలికివచ్చాడు. ఆయన రిటైరయ్యాక ఇప్పటికి పన్నెండు పెళ్ళిల్లు చేయించాడు. పెళ్లి చేయించడం సత్కాలక్షేపం, ప్రజాసేవ. అదీగాక బోల్డంత పుణ్యం వస్తుంది(ట). ఆడాళ్లవైపు సూటిగా చూసే కుర్రాళ్లకి, కుర్రాళ్లవైపు ఓరగా చూసే అమ్మాయిలకి ఆయన పెళ్లి సంబంధాలు చూస్తుంటాడు.

"ఇక్కడికి వచ్చేముందే మా ఇంటికి వచ్చారు వాళ్లు. అన్నీ చెప్పారు."

"ఇంజనీరుగారికి మజ్జిగ తీసుకురా" అన్నాడాయన. ఆవిడ వెళ్లింది. తనక్కడ ఉండటం భర్తకిష్టం లేదని ఆవిడకి తెలుసు.

"ఎంతలో ఉన్నారు?"

"పదిహేను వేలు, ఐదు తులాల బంగారం"

"అంతకట్నం నేనివ్వలేను"

"ఏదో రకంగా సంపాయించాలి...మీ అమ్మాయికి ఇరవై ఒకటి వెళ్లాయి. ఆలశ్యం చేస్తే లాభంలేదు" అన్నాడాయన వయసు పెరిగిన కొద్దీ కట్నం పెరుగుతుందని హెచ్చరిస్తూ.

"పదిహేనువేలు, పైగా బంగారం.. మొత్తం ముప్పై వేలు.. భరించలేను.. కొంత తగ్గించమనండి"

"కుదర్దన్నారు. ఇదీ కూడా అమ్మాయి బాగుందని తగ్గించే అడిగారుట."

"తగ్గించే ప్రతివాడూ ఇదే మాట చెబుతాడు."

ఆమె గుమ్మం చాటుకి నిలబడి, వింటోంది. పాతబడిన మాటలన్నీ.

"పన్నెండువేలు, నాలుగు తులాల బంగారానికి నేనొప్పిస్తాను. మీరు రెడీయేనా?"

"ఆలోచిస్తాను"

"ఆలోచించడం ఏమిటి? ఏదో మానవాళికి మహోపకారం చేస్తున్నట్లు... మీ కూతురు పెళ్లికట్నం ఇమ్మకోక తప్పదు"


"సరే అంతకంటే పైసా ఇవ్వలేను."

వాళ్ల సంభాషణ పూర్తవడం గమనించి ఆవిడ మజ్జిగ తెచ్చింది. ఇంజనీరు తాగేసి వెళ్లిపోయాడు.

"ఏమన్నారుట వాళ్లు?" అడిగిందామె ఏం తెలీనట్లు.

"పదిహేనువేలు, ఐదు తులాల బంగారం.. అడిగారుట. నేను పన్నెండువేలు, నాలుగు తులాల బంగారానికి ఒప్పుకున్నాను" చెప్పాడాయన. ఆవిడ అంతా విన్నదని తెలిసి కూడా.

'ఈ సంబంధం కుదిరితే బాగుణ్ను. అబ్బాయి బాగానే ఉన్నాడు. మంచి ఉద్యోగమే



వేస్తున్నాడు' అందావిడ ఎనిమిదోసారి. ఆయన నవ్వాడు పెళ్లిమాపులకొచ్చిన ప్రతివాడు భార్యకి నచ్చుతున్నందుకు.

మూడురోజుల తర్వాత ఇంజనీరు కబురు చేశాడు. కట్నం పైసాకూడా తగ్గించడానికి ఇష్టపడటంలేదని. ఆయన ఆ సంబంధం వదిలేశాడు. ఆవిడ నిరాశ పడింది.

ఆ బియెస్సీ ఫైనలియర్ అమ్మాయి ఏదో దినపత్రిక ఆదివారం అనుబంధంలో కట్నాన్ని, కట్నం తీసుకునే యువకుల్నితిడుతూ పెద్ద వ్యాసం రాసేసింది.

ఏడాది గడిచింది. ఇంకో ముగ్గురు ఆమెను చూశారు. వెళ్లారు. ఆమె బియెస్సీ పాసైంది. ఏం తోచక వీధి మలుపులో ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో టైపు నేర్చుకోవడం ప్రారంభించింది. పెళ్లికాని అమ్మాయిలు చాలామంది లాగానే.

ఆయన సంబంధాలు చూస్తునే ఉన్నాడు. తనెంత కట్నం ఇవ్వగలడో చెబుతూనే ఉన్నాడు. ఆవిడ నిరాశ పడుతూ ఆశపడుతూ ఎదురు చూస్తూనే ఉంది.

ఆరోజుసాయంత్రం హడావిడిగా వచ్చాడు ఇంజనీరు. ఆవిడ కాఫీ ఇచ్చింది. తాగాడు.

"నీకో మంచి శుభవార్త. కిందటేడు మన మమ్మాయిని చూ పెళ్లలేదూ, ఆంధ్రాఎలక్ట్రానిక్ కంపెనీ కుర్రాడు అతని తండ్రి మళ్లీ కబురుచేశాడు."

"ఎందుకూ ఏడాది తర్వాత?"

"ఇప్పటికైనా గుర్తొచ్చినందుకు సంతోషించండి. పన్నెండువేలు నాలుగు తులాల బంగారానికి రెడీయేనట. ఆ బంగారంతో అమ్మాయికి గాజులు చేయిస్తారుట. నీతో చెప్పమన్నారు."

"మనమ్మాయికి మనం చేయించుకోలేమా? వాళ్లకి బంగారం ఇవ్వడం దేనికి? వాళ్లు చేయించడం దేనికి?"

"అదో ముచ్చట.."


"ఇప్పుడింత హఠాత్తుగా మా సంబంధం ఎందుకు గుర్తొచ్చిందో?"

"ఏమో, ఆ ప్రశ్న నేనడంలేదు. ఆయన చెప్పలేదు. అయినా ఆ ప్రశ్నలన్నీ మన కనవసరం. మనమ్మాయికి మొగుడు కావాలి. వాళ్లకి కట్నం కావాలి."

"ఈ ఏడాదిలో ఎంత మందిని చూశారో?"

"మీరు మాత్రం చూడ్డంలేదూ? అర్ధనూట పదహార్లకి ఎమ్మే వాడు దొరుకుతాడేమోనని"

"సర్లే సర్లే... అప్పుడు కట్నం చాలదని



వెళ్లారు గదా అని కొంచెం అనుమానంగా ఉంది."

"ఊరికే సాగదీయడం అనవసరం. ఇది తాడుముక్క వ్యవహారం, రబ్బరు ముక్క కాదు. మీకిష్టమో కాదో తేల్చి చెప్పండి."

ఆయన లోపలికి వెళ్లి భార్యకి చెప్పాడు. ఆవిడ వెంటనే ఒప్పుకుంది. అమ్మాయికి పెళ్లి కళ వచ్చేసిందని చెప్పి సందర్భాను గుణంగా పాత సామెత కూడా చెప్పింది. ఆయన బైటికి వచ్చాడు.

"సరే మీ ఇష్టం. మీ లాంటి పెద్దవాళ్లు చెప్పినప్పుడు కాదనకూడదు. తాంబూలాల రోజు మనం అనుకున్నంతా ఇస్తాను. మళ్లీ పేచీ పెట్టొద్దని చెప్పండి"

"అవన్నీ నేను చూసుకుంటానుగా. పేచీ పెడితే పోలీసులతో చెప్పవూ!" అన్నాడు ఇంజనీరు నవ్వుతూ.

"ఇంకోమాట.. ఆ నాలుగు తులాల బంగారానికి అయ్యే డబ్బు కూడా ఇస్తాను. బంగారం వాళ్లనే కొనుక్కోమనండి. మనం తెస్తే నసుగుతారేమో"

"ఈ సలహా నేనే ఇద్దామనుకుంటున్నాను... మీరే చెప్పారు"

పెళ్లి నిశ్చయమైపోయింది. తాంబూలాలు పుచ్చుకుని, శుభలేఖ రాయించారు. ఆయన పన్నెండువేలు, నాలుగు తులాల బంగారానికయ్యే డబ్బు ఇచ్చాడు. వియ్యంకుడు ఆయన్ని బావగారూ, ఆవిడని అక్కగారూ అని ఆప్యాయంగా మాట్లాడాడు. కాబోయే కోడలికి ముద్దుగులంత గాజులు వేయిస్తానని చెప్పాడు.

ఆరోజు రాత్రికి పెళ్లి. ఆయన ఇంట్లో ఇంటి ముందు హడావుడి... షామియానా... పట్టుచీరెలు... భజంత్రీలు... పిల్లల అల్లరి... కేకలు, నవ్వులు...

"పెళ్లికొడుకుని పీటలమీదకి రమ్మనండి" బ్రాహ్మడు చెప్పాడు.

"రాడట... అతని పెద్ద చెల్లెలు చెప్పింది..."

"ఎందుకని?" గాభరాగా అడిగాడు ఆమె తండ్రి.

"ఆవిడకి ఆడపడుచు కట్నం వెయ్యినూటపదహార్లు ఇస్తే తప్ప అన్నగార్ని పీటలమీదకి పంపదట."

"ఇరవై నాలుగువేలు ధారపోశాను కదా... ఇప్పుడిదేం ఉపద్రవం?"

"ఆటలో అరటిపండనుకో."

"ఇప్పటికిప్పుడీ వెయ్యి నూటపదహార్లు ఎక్కడి నుంచి తేవాలి... ఇప్పుడిస్తే మిగతాఖర్చుల మాటేవిటి?"

"మాకేం తెలీదు. గంగలోదూకు... రైల్లో అంతదూరం వెళ్లి దూకడం కష్టమనిపిస్తే గోదాట్లో కలిసిపో."

ఆయన వియ్యంకుణ్ణీ, ఆయన భార్యనీ, వాళ్లిద్దర్నీ పుట్టించినవాళ్లని, వాళ్లిద్దరూ పుట్టించినవాళ్లని తిట్టుకుంటూ వెయ్యినూటపదహార్లు తెచ్చి, తన కూతురికి కాబోయే మరదలికి పంపించాడు. కొత్త చీర, రవికగుడ్డతో సహా.

పెళ్లికొడుకు పీటలమీదకి వచ్చాడు.

"ఆ అమ్మాయికి బుద్ధిలేకపోతే పెళ్లికొడుక్కయినా ఉండాలి" అన్నాడాయన భార్యతో రహస్యంగా...

"ష్.. మాట్లాడకండి, బాగుండదు."

"కట్నం, లాంఛనాలప్పుడు ఆడపడుచు కట్నం ప్రసక్తే లేదు. ఇప్పటికిప్పుడు సృష్టించారు. నా అనుమానం అమ్మాయి

అడిగి ఉండదు. పెద్దాళ్లే మారిపోసుంటారు."

"పోనీద్దురూ. నడుం వరకు మునిగాం... మెడదాకా మునగడానికి భయపడ్డం దేనికి?"

"ఇలా బాధపెట్టే డబ్బు గుంజేవాళ్లు బాగుపడరు."

"పెళ్లి పందిట్లో ఏం మాటలు?"

"ఆడపడుచు కట్నం కోసం ఇంత హడావుడి చేసినవాళ్లు ఇచ్చినమాట ప్రకారం మనమ్మాయికి గాజులు చేయిస్తారని నాకేం నమ్మకం లేదు" అన్నాడాయన మరీ మెల్లిగా.

"చేయించే ఉంటారు. ముందే ఊహించుకుని బాధపడ్డం దేనికి?"

"మన దురూహ నిజమైతే అప్పటికి బాధ తగ్గుతుందని."

"మరిప్పుడేం మాట్లాడకండి... చదివింపులప్పుడు ఇవ్వకపోతే ఆలోచిద్దాం."

"ఆలోచించడం కాదు... నానా యాగీ చేసేస్తాను... అడుగులకి మడుగులొత్తుతూ కూచుంటే ఈ కాలంలో లాభం లేదు. మనకేం మాట్లాడకపోతే గాజులు చేయించాను, మా చిన్నమ్మాయి ముచ్చటపడితే ఇచ్చేశానంటారు..."

ఆవిడ మాట్లాడలేదు. పెళ్లికొడుకు పీటలమీదికి వచ్చాడు. నెత్తిమీద బెల్లం, జీలకర్ర, తెరపట్టడం, మంగళసూత్ర ధారణ పూర్తయింది. చదివింపులు మొదలయ్యాయి. 'వివాహ మాహోత్సవ సందర్భంగా అమ్మాయి మావగారు ఆశీర్వదించి ఇచ్చినవి రెండు బంగారు గాజులు' అని బ్రాహ్మడు ప్రకటిస్తాడేమోనని ఆయన పాపం చాలా ఆదుర్దాగా, తన ఊహ నిజం కాకుడదనే ఆశతో ఎదురు చూశాడు. కాని ఆ ప్రకటన వినిపించలేదు.

భోజనాలయ్యాయి. ఆయన వియ్యంకుడి దగ్గరికి మనసులో మండిపడుతూ వెళ్లాడు.

"పెళ్లిరోజున... బంగారు... గాజులు.." గొణిగాడాయన. వియ్యంకుడు బ్రహ్మాండమైన జోకు పేలినట్టు ఆనందంగా నవ్వాడు.

"ఆ సంగతే చెబుదామనుకుంటున్నారు... మీరే వచ్చారు... మీరిచ్చిన డబ్బులో బంగారంరాని మా పరబ్రహ్మం కిచ్చాం... పెళ్లినాటికి చేసిస్తానని మాటిచ్చాడు తప్ప మాట నిలుపుకోలేదు... అక్కడికే పాపం మా వాడు రోజూ పరబ్రహ్మం దగ్గరికెళ్లి కూర్చునేవాడు... ఏం చేస్తాం?"

"సర్లెండి... ఇవాళ కాకపోతే రేపు చేసిస్తాడు... ఒకమాట చెబుదామని వచ్చా గాజుల సంగతి ఎత్తాను."

"చెప్పండి బావగారు"

"పెళ్లయిపోయింది... అది కాస్త అయిపోతే?"

"గర్భాదానమా! ఇప్పుడేం కుదర్దు"

"అలా అంటే ఎలా బావగారూ! ఈ వారంలోనే మంచిరోజు చూసి..."

"మంచిరోజు కాదు సమస్య... మావాడి ఫ్రెండు..."

"ఏమన్నాడతను. భోజనం బాగలేదన్నాడా? మర్యాదలు చేయలేదన్నాడా? రాత్రి పేకముక్కలు తెమ్మంటే మా చిన్నాడు తెచ్చిచ్చాడే?"

"అవేంకాదు... మా వాడి పెళ్లికి కొత్తస్కూటర్ మీద వస్తానని అతను శపథం చేశాట్ట. ఇప్పుడు నిజంగా మాట నిలబెట్టుకున్నాడు. ఆ కుర్రాడి స్కూటర్ చూసి... మీ అల్లుడు... తెగ ఇదైపోతున్నాడు."

"ఎందుకండీ స్కూటర్లు, మోటారు సైకిళ్లూ... పేపర్లలో యాక్సిడెంట్లు చదువుతుంటే రోడ్డుమీదకి వెళ్లడానికే భయంగా ఉంది."

"ఏవో, నేనెంత చెప్పినా మీ అల్లుడు వినడం లేదు. స్కూటరనే కలువరిస్తున్నాడు. కట్నం కరక్టుగానే ఇచ్చారు. ఆడపడుచు కట్నం కరెక్టుగానే ఇచ్చారు.

పెళ్ళి ఓమోస్తరుగా చేయించారు. ఇప్పుడు స్కూటర్ అడగడం బ్బాగుండదని చెప్పినా వాడు వినడంలేదు. కావాలంటే మీ అల్లుడితో మీరే మాట్లాడికోండి".

ఆయన వెళ్ళాడు. పెళ్ళి కొడుకు పెళ్ళి కొడుకులాగానే ఉన్నాడు. ఆరోజే గీసిన గడ్డం, తలంటుకున్న జుట్టు, కిందికి వాలిన దుబ్బ మీసాలు, తెల్ల లుంగీ.. మంచం మీద పడుకుని ఏదో వారపత్రికలో శృంగారకథ చదువుతూ విచ్చలవిడిగా ఊహించుకుంటున్నాడు.

"మీరు స్కూటర్ కావాలన్నారని... మీ నాన్న చెప్పారు అన్నాడాయన. అల్లుడితో మెట్ట మొదటిసారి స్కూటర్ గురించి మాట్లాడం ఆయనకేం నచ్చలేదు.


" మా నాన్న మాటల్లో అబద్ధమేం లేదు.. నేను స్కూటర్ అడిగాను..."

"ఇప్పటికే చాలా ఖర్చయింది. మీతో చెప్పకూడదనుకోండి..కాని...."

"స్కూటర్ కొనిస్తే ఇంకో పది పేనువేలవుతుంది. ...అంతేగదా?"

చెల్లెలు చెప్పిందని పీటల మీదికి రానివాడు.. కాబోయే భార్యగాజుల గురించి పట్టించుకోని వాడి తల్లిదండ్రుల మాట జవదాటకుండా స్కూటర్ కోసం భీష్మించుక్కూమన్నవాడు. తన గోడు వినడని ఆయనకి అర్థమైపోయింది. దాంతోపాటే రోషం కూడావుంది.

వెంటనే మార్వాడీ దగ్గరకి వెళ్ళి, అప్పుతెచ్చి స్కూటర్ కొనిచ్చాడు. ఆరోజు



ఉదయం వారపత్రిక

సాయంత్రాన వియ్యంకుడు బ్రాహ్మణ్ణి కూర్చుని శోభనానికి ముహూర్తం నిర్ణయించారు.

****

ఆ గది గోడలు తెల్లగా ఉన్నాయి.

మెల్లిగా మెత్తగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ తెల్లగా ఉంది.

డబ్బుల్‌కాట్ మీదున్న దుప్పటి తెల్లగా వుంది: పక్కనే స్టూలు మీద తెల్లసాసరుతో నిలబడివున్న పాలగ్లాసు, అందులో పాలు తెల్లగా వున్నాయి. పక్కమీద మల్లెపూలు తెల్లగా వున్నాయి. కిటికీలోంచి పడుతున్న వెన్నెల, గోడ మీది ట్యూబ్‌లైటు దాని వెలుతురూ తెల్లగా ఉన్నాయి.

ఆ గదంతా తెల్లతెల్లగా మరివెచ్చగా వుంది. డబుల్‌కాట్ మీద కూర్చున్న అతను, గుమ్మం దగ్గర నిలబడ్డ ఆమె తెల్లని బట్టల్లో ఉన్నారు.

అతను నవ్వాడు, ఆ నవ్వుతెల్లగావుంది.

ఆమె నవ్వింది, ఆ నవ్వూ తెల్లగానే వుంది.

వాళ్ళిద్దరికే అంతకు ముందు రెండుక్షణాల క్రితమే వెన్నెలలో అభిషేకం చేయించినట్టు తెల్లతెల్లగా మెరిసిపోతున్నారు.

అతను మంచం మీంచిలేస్తూ మళ్ళీ నవ్వాడు. గర్వంగా, మృదువుగా.

ఆమె గుమ్మం దగ్గర్నించి కదలకుండా నవ్వింది. సిగ్గుగా మృదువుగా, మత్తుగా...

"ఎందుకు నవ్వుతున్నావు" అడిగాడు అతను.

ఆమె జవాబు చెప్పకుండా నవ్వింది. పెదాలు విడివిడకుండా అతనామె దగ్గరికి వచ్చాడు. ఆమె అతనివైపు వెళ్ళబోయి మానేసింది.

"ఎందుకానవ్వు?" అడిగాడుతను మళ్ళీ, ఆమె భుజాలమీద చేతులేస్తూ.

" ఏంలేదు"

"ఏంలేకపోతే నవ్వడం ఎందుకు?"

"మీరెందుకు నవ్వుతున్నారు?"

"పెళ్ళిచూపుల్లో మొదటి సారి నిన్ను చూసి చూడగానే ఇష్టపడ్డాను. ఈమెను పెళ్ళి చేసుకుంటే బాగుండుననుకున్నాను. నేననుకున్నట్టే పెళ్ళయింది. ఈ సంగతి చెబితే పెళ్ళి చూపుల్లోనే ప్రేమించారా అని నవ్వుతామేమోనని నాకు నవ్వొచ్చింది".

"నేనూ అంతే మనపెళ్ళి చూపులైన మర్నాడు రిటైర్డ్ ఇంజనీరు గారింటికి వెళ్లానుకాని మీ ప్రస్తావన ఎలా తీసుకురావాలో అర్థంకాలేదు. రెండు, మూడు సార్లు ఆంధ్రా ఎలక్ట్రానిక్స్ అన్నాను. సందర్భం పాడూ లేకుండా. దాంతో ఇంజనీరు గారు గ్రహించారు. మీకు నేను నచ్చానని చెప్పారు. ఆ సంగతి ఇప్పుడు మీతో చెబితే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తుంటే నవ్వొచ్చింది".

అతను ఇంకోసారి నవ్వాడు.

ఆమె మరోసారి నవ్వింది.

ఎవరుచెబుతారు వాళ్లతో, నవ్వకండి, ఇది విషాదమని?.


## ఉదయం

నవతరం వారపత్రిక

### చందా వివరాలు

మూడు నెలలకు (పదమూడు సంచికలు) రూ. 62.00

ఆరు నెలలకు (ఇరవైఆరు సంచికలు) రూ. 124.00

పన్నెండు నెలలకు (ఏభైరెండు సంచికలు) రూ. 248.00

చందాదారులు కాదల్చుకున్నవారు

పద్మాఅరుణ్ పబ్లిషర్స్ ప్రై.లి.,

హైదరాబాద్–20

పేరుమీద మనియార్డరుగాని, డి.డి.గాని తీసుకుని–

ఈ క్రింది చిరునామాకు పంపవలెను

సర్క్యులేషన్ మేనేజర్
ఉదయం నవతరం వారపత్రిక
7/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాద్–20

గమనిక:– చెక్కులు అంగీకరింపము.

డి.డి.తోపాటు ఈ క్రింది కూపన్‌ను పూరించి పంపండి.

— కూపన్ —

పేరు...............

ఊరు...............

చిరునామా............

...................

...................

పిన్ కోడ్ నెంబరు......................